


ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM

శుక్రవారం, 18 జూలై 2025

మిర్చి.. సాగు తగ్గుతోంది. ఎర్ర బంగారంగా పేరొందిన మిరప పంట సాగులో ఉమ్మడి ఖమ్మం జిల్లా దశాబ్దాలుగా రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచి దేశ, విదేశాలకు ఎగుమతవుతున్న మిర్చి.. ఒక్కసారిగా ఈ ఏడాది సాగు గణనీయంగా పడిపోతోంది. ఉమ్మడి జిల్లాలో గతేడాది లక్షా30వేల ఎకరాల వరకు సాగు జరగ్గా.. ఈ ఏడాది సగానికి సగం పడిపోతోంది. మిర్చి నారుమళ్లు తగ్గడంతో పాటు రైతులు కూడా అంతగా ఆసక్తి కనబర్చడం లేదు. ఈ ఏడాది ఖమ్మం జిల్లాలో ఉద్యాన శాఖ 64 వేల ఎకరాల్లో మిర్చి సాగు లక్ష్యంగా పెట్టుకోగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 15 వేల ఎకరాల్లో సాగు లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ మాత్రం కూడా సాగయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లా మొత్తంగా 60వేల ఎకరాలకు మించి సాగు ఉండే పరిస్థితి కనిపించడం లేదు. ప్రతీ సీజన్‌లో మిర్చి విత్తనాలకు విపరీతమైన డిమాండ్ ఉండేది. ఈసారి మిర్చి విత్తనాల వ్యాపారం కూడా స్తబ్దుగానే సాగుతోంది. ప్రైవేటు నారుమళ్ల నర్సరీలు కూడా పోటాపోటీగా సాగుచేసే పరిస్థితి ఉండగా.. ఈసారి మిర్చి నర్సరీలు సైతం వెలవెలబోతున్నాయి. నర్సరీల్లో పెంచేందుకు కూడా ఎవరూ అంతగా ఆసక్తి కనబర్చడం లేదు.



(ఫైల్)

మిర్చి.. సాగు తగ్గుతోంది!

మిరప పంటపై ఆసక్తి చూపని ఉమ్మడి జిల్లా రైతులు

- సగానికి సగం పడిపోతున్న సాగు
- అన్నదాతలకు భారంగా మారిన విత్తనాలు, ఎరువుల ధరలు
- ప్రత్యామ్నాయ పంటల వైపు.. రైతుల చూపు

ఖమ్మం, జూలై 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వాస్తవానికి గత దశాబ్ద కాలంగా ప్రతి ఏటా ఉమ్మడి జిల్లాలో మిర్చిసాగు గణనీయంగా పెరుగుతూ వస్తోంది. మిర్చి సాగుతో వేలాది కోట్ల రూపాయల టర్నోవర్ నడుస్తోంది. ఇక్కడ పండే మిర్చి మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, గుజరాత్, పశ్చిమబెంగాల్, యూపీ, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి కావడంతో పాటు సింగపూర్, మలేషియా, బంగ్లాదేశ్, చైనా, ఇండోనేషియా, శ్రీలంక తదితర దేశాలకు కూడా ప్రతీ యేడు పెద్ద ఎత్తున ఎగుమతి అవుతోంది. ధర కూడా ఆశాజనకంగా ఉండేది. రైతులకు గతంలో క్వింటాకు రూ.18వేల నుంచి 23వేల వరకు ధర రావడంతో.. లాభసాటిగా భావించి మిర్చి పంట సాగు చేస్తూ వస్తున్నారు. పంట బాగా పండి ధర ఆశాజనకంగా ఉంటే.. ఎకరానికి రూ.లక్ష వరకు రైతులు లాభాలు చూసే పరిస్థితి ఉండగా.. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

తగ్గిన ధరతో..

మిర్చి ధర సీజన్ ప్రారంభంలో క్వింటాకు రూ.18వేల వరకు ఉండగా.. ప్రస్తుతం క్వింటాకు రూ.10నుంచి 12వేల వరకు ధర పడిపోయింది. ఈ ధరతో మిర్చిసాగు చేస్తే రైతులు భారీగా నష్టం చూసే అవకాశం ఉంది. ఎకరానికి రూ.లక్ష నుంచి లక్షా50వేల పైగా రైతులు పెట్టుబడి పెట్టే పరిస్థితి ఉంది. దీనికి తోడు పెరిగిన కౌలు, విత్తనాల, ఎరువులు, కూలీల ధరలు కూడా రైతులకు భారంగా మారుతున్నాయి. దిగుబడి 15నుంచి 20క్వింటాళ్ల వరకు సగటున వస్తున్నా.. ధర లేకపోవడంతో రైతులు దెబ్బతింటున్నారు. గతంలో తామరపురుగుతో నష్టపోతే ఈఏడాది

(మిగతా 6వ పేజీలో)

అర్హులందరికీ ఇళ్లు, రేషన్ కార్డులిస్తున్నాం

- ఇప్పటికే 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం
- 93లక్షల పేద కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ
- ఈ ఏడాది మహిళలకు రూ.21,632 కోట్ల వడ్డీలేని రుణాలందించాం
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి
- సత్తుపల్లిలో ఘనంగా మహిళా శక్తి సంబురాలు
- హాజరైన ఎమ్మెల్యే రాగమయి, అదనపు కలెక్టర్ శ్రీజ



సత్తుపల్లిలో మహిళలకు వడ్డీలేని రుణాల చెక్కులను అందిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే రాగమయి, అదనపు కలెక్టర్ శ్రీజ, తదితరులు

సత్తుపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీమేరకు అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి గురువారం సత్తుపల్లిలో జరిగిన నియోకవర్గస్థాయి మహిళా శక్తి సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కులు, లోన్ బీమా, ప్రమాద బీమా చెక్కులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం చిత్తశుద్ధితో, నిజాయితీతో పనిచేస్తుందన్నారు. ప్రజల ఆశీస్సులతో తమ ప్రభుత్వం 18నెలలు పూర్తి చేసుకుందని, గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన అరకొరా మంచి పనులను కొనసాగిస్తూ ప్రజల కోరికలు తీరుస్తూ ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలను అమలు పరుస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు పొందిన ఆడబిడ్డల కళ్లల్లో ఆనందం చూస్తుంటే కొందరు ఓర్వలేకపోతున్నారని, కుల,మత, రాజకీయాలకతీతంగా అర్హులైన పేదలందరికీ మంజూరు చేస్తున్నామన్నారు. ఈనెల 21వరకు వడ్డీలేని రుణాల చెక్కులను అందిస్తామని, మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు చేయిస్తున్నామని, త్వరలోనే రైస్‌మిల్లులను కేటాయించనుండగా ఇప్పటికే ఆర్టీసీలో అద్దెబస్సుల నిర్వహణతో మహిళలను భాగస్వామ్యం చేశామన్నారు. ఎమ్మెల్యే రాగమయి

(మిగతా 8వ పేజీలో)



కూసుమంచిలో మాట్లాడుతున్న మంత్రి

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కూసుమంచిలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి 8



నేషనల్ జియోస్పేషియల్ ప్రాక్టీషనరీ అవార్డును అందుకుంటున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాద్రి జిల్లాకు ప్రతిష్ఠాత్మక అవార్డులు

నేషనల్ జియోస్పేషియల్ ప్రాక్టీషనరీ, ఓపెన్ సోర్స్ జీఎస్ఐ కోహార్ట్ అవార్డులు అందుకున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం ఐఐటీ బాంబేలో నిర్వహించిన ఓపెన్ సోర్స్ జీఐఎస్ డేలో నేషనల్ జియోస్పేషియల్ ప్రాక్టీషనర్ అవార్డుతో పాటు ప్రతిష్ఠాత్మక ఓపెన్ సోర్స్ జీఐఎస్ కో హార్ట్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డులను ఐఎస్ఆర్వో మాజీ చైర్మన్ ఎఎస్. కిరణ్‌కుమార్ ప్రదానం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రామీణ సమస్యల పరిష్కారం కోసం చొరవ తీసుకుని, జియోస్పేషియల్ టెక్నాలజీ ద్వారా జిల్లా విద్యార్థులు, అధికారులు, భాగస్వాములుగా

(మిగతా 6వ పేజీలో)

నాటి ప్రళయానికి ఏడాది

- ఊహించని వరదకు కొట్టుకుపోయిన పెదవాగు ప్రాజెక్టు
- ప్రాణాలతో బయటపడిన 18మంది యువకులు, రైతులు 6
- తుడిచి పెట్టుకుపోయిన పంటలు
- మదిని వదలని నాటి పరిస్థితులు



వరదలకు కొట్టుకుపోయిన పెదవాగు ప్రాజెక్టు (ఫైల్)



నేడు ఉమ్మడి జిల్లాకు కేటీఆర్..

ఖమ్మం, జూలై 17 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనకు రానున్నారు. అయితే ఆయన ఈ పర్యటనను పూర్తిగా పరామర్శలకే పరిమితం చేశారు. ఉదయం 10గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11గంటలకు ఖమ్మం నగరంలోని మమతా మెడికల్ కళాశాల మైదానం వద్ద హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం ఇటీవల మరణించిన మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ నివాసానికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. ఆతర్వాత 12గంటలకు హెలికాప్టర్‌లో కరకగూడెం మండలం సమత భట్టుపల్లి గ్రామానికి చేరుకుంటారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తల్లి ఇటీవల మరణించిన క్రమంలో అక్కడ రేగా కాంతారావు, కుటుంబసభ్యులను పరామర్శిస్తారు. అనంతరం కేటీఆర్ హెలికాప్టర్‌లో హైదరాబాద్ తిరుగుపయనమవుతారు.



తుమ్మలను సన్మానించి నినాదాలు చేస్తున్న రైతులు

తుమ్మలకు రైతుల సన్మానం

గోదావరి జలాల విడుదలకు కృషి చేసిన మంత్రికి కృతజ్ఞతలు

తల్లాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వర్షాభావం వల్ల ఎండిపోతున్న పైర్లను కాపాడేందుకు సీతారామ ద్వారా గోదావరి జలాల విడుదలకు కృషిచేసిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును తల్లాడలో పలువురు రైతులు ఘనంగా సత్కరించారు. గురువారం రాత్రి ఖమ్మం నుంచి దమ్మపేట మండలం గండుగులపల్లి వెళ్తున్న ఆయన్ను తల్లాడ వద్ద రైతులు ఆపి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని సిరిపురం మేజర్ కాలువకు గోదావరి జలాల విడుదలకు కృషిచేసిన మంత్రి తుమ్మలను ప్రశంసిస్తూ రైతులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల బ్లాక్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు కిషోర్, రాయల రాము, ఎర్రి కృష్ణారావు పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

- నగర పర్యటనలో మంత్రి తుమ్మల
- రూ.2కోట్ల రైల్వేకాంప్లెక్స్‌కు శంకుస్థాపన 6

మన్మోహన్‌సింగ్ పేరుతో..

- ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీకి పేరు ఖరారు
- ఉత్తర్వులిచ్చిన రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ
- కొత్తపేరుతోనే ఈ ఏడాది ఇంజనీరింగ్ కౌన్సెలింగ్
- భవనాలు, ల్యాబ్, హాస్టళ్లకు రూ.500కోట్లు అవసరం



కొత్తగూడెం ఎడ్యుకేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడెంలోని ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీకి మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ పేరు పెట్టాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వర్సిటీకి మన్మోహన్ సింగ్ పేరును ఖరారు చేస్తూ రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ తాజాగా ఉత్తర్వులిస్తూ ఈనెల 7న జీవో నెం28ని జారీ చేసింది. ఈ నేపథ్యంలో 2025-26 విద్యాసంవత్సరానికి జరుగుతున్న ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో కూడా డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ పేరుపైనే అడ్మిషన్లు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఈ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ట్రిపుల్ ఇ, ఇసీఇ, మైనింగ్ కోర్సులున్నాయి. ఒక్కో కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. వీటితోపాటు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు కూడా ఉన్నాయి. కొత్త వర్సిటీ పేరుతో అధికారులు వెబ్‌సైట్‌ను కూడా డిజైన్ చేశారు.

యూనివర్సిటీలో కొత్త కోర్సులు

మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణలో గతంలో ఉన్న పాత కోర్సులతో పాటు కొత్తగా జియాలజీ,

(మిగతా 6వ పేజీలో)

పురుషోత్తపట్నంలోని భూములన్నీ రామయ్యవే..

- శాంతియుత మార్గంలో పరిష్కారానికి ఇరు ప్రభుత్వాలకు నివేదిస్తాం
- స్టీరింగ్ కమిటీ ఏర్పాటు అవసరం
- ఉమ్మడి రాష్ట్రంలో అన్య మతానికి కేటాయించిన స్థల జీవోను రద్దు చేయాలి
- ప్రభుత్వాలు స్పందించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం
- ఏపీ సాధు పరిషత్ నాయకుల వెల్లడి
- భద్రాద్రి దేవస్థానం, పురుషోత్తపట్నం వాసుల నుంచి వివరాల సేకరణ



పురుషోత్తపట్నం వాసులతో మాట్లాడుతున్న సాధు పరిషత్ అధ్యక్షుడు

భద్రాచలం, జూలై 17 (ఆంధ్రజ్యోతి):భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి చెందిన భద్రాచలం సరిహద్దున ఉన్న ఏపీలోని పురుషోత్తపట్నంలో ఉన్న భూములన్నీ రామయ్యవేనని ఏపీ సాధు పరిషత్ నాయకులు స్పష్టం చేశారు. గురువారం ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు, ఆనంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి, గౌరవ అధ్యక్షుడు అట్లూరి నారాయణరావు, గౌరవ సలహాదారు కురిచేటి రామచంద్రమూర్తి, హిందూ సంఘాల నాయకులు తురగ శ్రీరామ్ భద్రాద్రి రామాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం వారికి రామయ్య భూముల వివరాలతో పాటు భూ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల గురించి దేవస్థానం

(మిగతా 6వ పేజీలో)

ఉమ్మడి జిల్లాలో
వర్షం

» అన్నదాతల్లో ఆనందం

ఖమ్మం, జూలై 17 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): వర్షాభావ పరిస్థితులతో తల్లడిల్లుతున్న ఉమ్మడి జిల్లా రైతులకు ఉపశమనం కలిగింది. గురువారం కురిసిన వర్షంతో ఎండుతున్న నారుమడులు, ఇతర మెట్టపంటలకు ఊపిరిపోసినట్టయింది. గురువారం సాయంత్రం నుంచి ఖమ్మం, కొత్తగూడెంతోపాటు ఇరుజిల్లాల్లో మోస్తరు వాన పడింది. వానల్లేక ముందస్తుగా వేసిన పత్తి, వరి, మొక్కజొన్న, కంది, పెసర, మినుము, జనుము, పిల్లిపెసర, ఇతర కూరగాయల పంటలు ఎదుగుదల లేకుండా పోయాయి. వీటిని కాపాడేందుకు అటు సీతారామ కాలవ ద్వారా గోదావరి నీరు, ఇటు పాలేరు నుంచి సాగర్ నీరు వదలారు. గురువారం సాయంత్రం పడిన వర్షం ఆకాశ వాయు పంటలు, మెట్ట, పోడు భూముల్లో వేసిన పంటలకు మేలు చేకూర్చింది.

నాటి ప్రళయానికి ఏడాది

» వరదకు కొట్టుకుపోయిన పెదవాగుప్రాజెక్టు
» ప్రాణాలతో బయటపడిన 18మంది యువకులు, రైతులు
» తుడిచి పెట్టుకుపోయిన పంటలు
» భయంతో గడిపిన పలు గ్రామాల ప్రజలు

అశ్వారావుపేట రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): గతేడాది ఇదే రోజు...అశ్వారావుపేట మండలానికి ఓ చీకటి రోజుగానే భావించాలి. ఊహించని విధంగా వచ్చిన వరదలతో రెండు తెలుగు రాష్ట్రాల్లో 16వేల ఆయకట్టు కలిగిన పెదవాగుప్రాజెక్టు కొట్టుకుపోయింది. వేల ఎకరాల్లో పంటలు కొట్టుకుపోగా ఇసుక మాత్రమే మిగిలింది. వరదలతో చిక్కుకున్న 18మందిని ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. రాత్రంతా భయంతో ప్రాణాలతో గుప్పిట్లో పెట్టుకుని బతికాయి పలు గ్రామాలు. అశ్వారావుపేట మండలంలో గత ఏడాది జూలై 18న మధ్యాహ్నం నుంచి ఆకాశానికి భారీ గండి పడిందా అనే విధంగా వర్షం పడటంతో గుమ్మడివల్లి సమీపంలోని మధ్యతరహా జలాశయం పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో అశ్వారావుపేట, వేలేరుపాడు మండలాల్లోని అనేక గ్రామాలు నీటి మునిగాయి. పంటలు, విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌లు, వాహనాలు కొట్టుకుపోయి గోదావరిలో కలిశాయి. పొలాల్లో ఎక్కడ చూసినా ఇసుక మేటలు, పెద్ద పెద్ద రాళ్లు మాత్రమే ఉన్నాయి. నారాయణపురం సమీపంలో పొలానికి వెళ్లిన 18మంది కూలీలు, యువకులు వరదలో చిక్కుకుని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఆర్తనాదాలు చేయగా అశ్వారావుపేట, పోలవరం ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, బాలరాజులు ఆంధ్రా నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌ను తెప్పించి అందరి ప్రాణాలను కాపాడారు. జిల్లా కలెక్టర్ జితేశ్ పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీవో రాహుల్ రాత్రంతా అక్కడే ఉండి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను పర్యవేక్షించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రతి నిమిషం అధికారులను అప్రమత్తం చేశారు. ఈస్థాయిలో జరిగిన ఆనాటి ఘటన నేటికి ఈప్రాంత ప్రజల్లో గాయాలుగానే మిగిలింది.



వరదలకు పంటలు కొట్టుకుపోయి ఇసుక మిగిలిన దృశ్యం(ఫైల్)



మునిగిన కట్టమైసమ్మ ఆలయం(ఫైల్)

శాకంబరిగా
వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు

» కూరగాయలు, బ్రహ్మ కమలాలతో ప్రత్యేక అలంకరణ



అశ్వారావుపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం శాకాంబరి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు ముత్తా సుమాకర్ ఆధ్వర్యంలో అమ్మవారిని పలురకాల కూరగాయలతో అందంగా అలంకరించారు. ప్రత్యేకించి బ్రహ్మ కమలాలు తెప్పించి వాటితో పూజలు జరిపారు. భక్తులు కుంకుమ పూజలు చేశారు. వివిధ రకాల కూరగాయల మధ్య ఏర్పాటు చేసిన అమ్మవారు భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది. శాకాంబరి ఉత్సవాల సందర్భంగా కూరగాయలు, బ్రహ్మ కమలాలతో అలంకరింపబడిన అమ్మవారిని చూసేందుకు, పూజలలో పాల్గొనేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. అమ్మవారి నామార్చనలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

బిర్యానీ సెంటర్‌లో అగ్నిప్రమాదం

» రూ.1.70లక్షల ఆస్తినష్టం

సత్తుపల్లిరూరల్, జూలై17 (ఆంధ్రజ్యోతి): బిర్యానీ సెంటర్‌లో గురువారం ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదం జరిగింది. సుమారు రూ.1.70లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు సత్తుపల్లి ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్‌లోని స్పైసీ బిర్యానీ సెంటర్‌లో రోజువారీ కార్యక్రమంలో భాగంగా వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్‌కు ఐరన్ పొయ్యికి మధ్య పైపు లీకేజీ కారణంగా మంటలు చెలరేగాయి. ఆ తర్వాత మంటలు వ్యాపించి పక్కనే ఉన్న సాయిగణేష్ జిరాక్స్ ఇంటర్‌నెట్ సెంటర్‌లోకి వ్యాపించాయి. సమాచారం అందుకున్న సత్తుపల్లి ఫైరింజన్‌తో అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపుచేశారు. కాగా బిర్యానీ సెంటర్‌లో ఫ్రిజ్, మిక్సీ గ్రైండర్, మోటారు ఇతర పనిముట్లు, పక్కనే ఉన్న నెట్ సెంటర్‌లో కంప్యూటర్‌తో పాటు కాటాతో పాటు ఇతర సామాన్లు అగ్నికి దగ్ధమయ్యాయి. కార్యక్రమంలో డ్రైవర్స్ యు.వెంకటేశ్వరరావు, ఎస్‌కే.ఖాజా, ఫైర్‌మెన్ ఎం.సతీష్, కోలా బాబూరావులు పాల్గొన్నారు.

విప్పలమడకలో చోరీ

వైరా, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లా వైరా మండలం విప్పలమడక గ్రామంలో బుధవారం రాత్రి ఓ రైతు ఇంట్లో చోరీ జరిగింది. రూ.3.65లక్షల విలువైన సొత్తును దొంగలు అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైరా-నెమలి ప్రధాన రహదారి పక్కనున్న యడ్లపల్లి మంగయ్య అనే రైతు ఇంట్లో బుధవారం రాత్రి మంగయ్య దంపతులు ఇంటిముందు వరండాలో నిద్రించారు. అర్ధరాత్రి తర్వాత దొంగలు ఇంటి వెనుక నుంచి ఇంటి తలుపులను పగలగొట్టి లోపలకు ప్రవేశించి, బీరువా లాకర్‌లో ఉన్న మూడుతులాల బంగారు ఆభరణాలు, రూ.65వేల నగదును అపహరించుకుపోయారు. గురువారం తెల్లవారుజామున నిద్రలేచిన మంగయ్య సతీమణి ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని గమనించి భర్తకు తెలిపింది. వెంటనే ఖమ్మంలో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తమ కుమారుడు యడ్లపల్లి పుల్లారావుకు చోరీ విషయాన్ని ఫోన్ ద్వారా తెలిపారు. ఆవెంటనే పుల్లారావు వైరా పోలీసులకు సమాచారం ఇచ్చి విప్పలమడకలోని ఇంటికి చేరుకున్నాడు. వైరా ఎస్ఐ పి.రామారావు సంఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆతర్వాత క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు సేకరించింది. వైరా ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

» నగర పర్యటనలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల
» రూ.2కోట్లతో చేపట్టిన రైల్వేకాంప్లెక్స్‌కు శంకుస్థాపన



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం కార్పొరేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో చేపట్టే అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం ఖమ్మం 37వ డివిజన్‌లో రూ.2కోట్లతో నిర్మాణం చేపట్టనున్న రైల్వే షాపింగ్ కాంప్లెక్స్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని పిలుపునిచ్చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉచుకోవాలని, మొక్కలను విరివిగా నాటడంతో పాటు సంరక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రహదారుల వెడల్పుతో నగరం వేగంగా అభివృద్ధి చెందుతోందని, బాధితులను ప్రభుత్వం కచ్చితంగా ఆదుకుంటుందన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కమిషనర్ అభిషేక్ అగస్త్య, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీ కొన్న లారీ
వ్యక్తి దుర్మరణం

కారేపల్లి, జూలై17(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మండల పరిధిలోని కొమ్ముగూడెం బస్టాండ్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామేపల్లి మండలం అడవిమద్దులపల్లి గ్రామనికి చెందిన దుగ్గి సూర్యనారాయణ(52) ఇల్లెందు వైపు నుంచి మద్దులపల్లి వెళ్లేందుకు తన మోటర్‌సైకిల్‌పై వస్తుండగా, ఖమ్మం వైపు నుంచి వస్తున్న లారీ ఎదురుగా వచ్చి మోటర్‌సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో సూర్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ గోపి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సింగరేణి పీఆర్వోకు డాక్టరేట్

కొత్తగూడెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి హైదరాబాద్ కార్యాలయంలో ప్రజాసంబంధాల అధికారి (పీఆర్‌వో)గా పని చేస్తున్న శ్రీరాముల శ్రీకాంత్ తెలంగాణ యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. బుధవారం నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్శిటీలో జరిగిన రెండో స్నాతకోత్సవంలో గవర్నర్, యూనివర్శిటీ ఛాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ నుంచి డాక్టరేట్ సర్టిఫికెట్‌ను శ్రీరాముల శ్రీకాంత్ స్వీకరించారు. సాంఘిక రాజకీయ ఉద్యమాల్లో సామాజిక ఉద్యమాల పాత్ర, తెలంగాణ ఉద్యమంపై కేసుస్టడి అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక అధ్యయనానికి ఆయనకు డాక్టరేట్‌ను బహూకరించారు. ఈడీ (కోల్‌మూమెంట్) ఎస్‌డీ ఎం. సుభాని, జీఎం (మార్కెటింగ్) టి. శ్రీనివాస్, సింగరేణి భవన్ అధికారులు, ఉద్యోగులు తమ అభినందనలు తెలిపారు.

భద్రాద్రి జిల్లాకు
ప్రతిష్ఠాత్మక అవార్డులు

(5వ పేజీ తరువాయి)

పాల్గొని జిల్లా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేసినందుకు ఈ రెండు అవార్డులు లభించాయి. జిల్లాస్థాయి జీఐఎస్ ఆధారిత వ్యవస్థలను ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసి గ్రామీణ సమస్యల పరిష్కారంలో జియోస్పేషియల్ టెక్నాలజీ వినియోగంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పినందుకు ఈ గుర్తింపు లభించింది. గోదావరి వరదల సయంలో ఫ్లడ్ ప్రిడిక్షన్, గ్రామీణ స్థాయిలో జీఐఎస్ స్కిల్లింగ్ విభిన్న శాఖల డేటాను భౌగోళిక సమాచారం తో అనుసంధానం చేసి నిర్ణయాలు తీసుకునే విధానాలను జిల్లా యంత్రాంగం ముందుండి అమలు చేసింది. భారతదేశంలో మొట్టమొదటి ఓపెన్ సోర్స్ జీఐఎస్ కోహార్ట్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేయగా.. ఐఐటీ బాంబే ఫాజిల్స్ జీఐఎస్ సహకారం, క్యూజీఐఎస్ వినియోగాన్ని గ్రామీణ సమస్యల పరిష్కారానికి ప్రాక్టీకల్ నేర్పడంలో జిల్లా నేతృ త్వం వహించింది. గోదావరి వరదల ముందు ముంపు గ్రామాల గుర్తింపు, పీహెచ్‌సీ పరిధిలో విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణ, పత్తి రైతులను మునగ సాగు వైపు మారుస్తూ రైతులను స్వయం సమృద్ధి వైపు నడిపించే ప్రయత్నాలు జిల్లాలో కొనసాగుతున్నాయి. కాగా.. అవార్డు అందుకున్న అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భౌగోళికంగా తెలంగాణలో అతిపెద్ద జిల్లా అని అన్నారు. 37 శాతం గిరిజన జనాభాతో విస్తరించిందన్నారు. గిరిజనుల విలువైన సంస్కృతి.. కలిసికట్టుగా అభివృద్ధి వైపు పయనించేలా మార్గాన్ని చూపిస్తోందన్నారు. జీఐఎస్ సహాయంతో పత్తి, మొక్కజొన్న పొలాలను మ్యాప్ చేసి రైతులను మునగ సాగు వైపు మళ్లించే ప్రయత్నం మొద లు పెట్టినట్టు తెలిపారు. ఇది రైతులను ఆర్థికంగా ఎదిగేందుకు దోహద పడుతోందన్నారు. మేకల పెంపకం, మేకపాల ఉత్పత్తి పెంపుదలపై జీఐఎస్ ఆధారంగా పరిశీలన జరుగుతున్నట్టు తెలిపారు. ఈ వేదిక ద్వారా ఐఐటీ బాంబే సాంకేతిక పరిజ్ఞానాన్ని జిల్లాకు తీసుకువచ్చి.. రైతులు, విద్యార్థులు, అధికారులందరికీ ఉపయోగపడేలా చేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు ఐఐటీ బొంబాయి సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం, పట్టణాభివృద్ధి, కమ్యూనికేషన్ విస్తరణలో దృష్టి పెట్టి ఉత్పాదకతను పెంచి జిల్లాకు ఆర్థిక వృద్ధిని తీసుకు వస్తారన్న నమ్మకం తనకు ఉందన్నారు. ఈ సందర్భంగా ఐఐటీ బొంబాయి నిపుణులు, శాస్త్రవేత్తలతో పాటు పలు సంస్థలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు.

జిల్లా వాసులందరికీ గర్వకారణం : కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఈ రెండు అవార్డులు రావడం భద్రాద్రి జిల్లా వాసులందరికీ గర్వకారణమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జీఐఎస్ ఆధారిత కార్యక్రమంలో కృషి చేసిన హెచ్‌పీహెచ్ఎఫ్ బృందానికి, యాస్పిరేషనల్ బ్లాక్ ఫెలో నవనీతకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. జీఎస్ఐ ఆధారిత వ్యవస్థలను మరింత సమర్థవంతంగా విస్తరించేందుకు, ప్రజల అవసరాలకు అనుగుణంగా వాటిని అందుబాటులోకి తీసుకురావడానికి జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉంటుందన్నారు. ఫాసెస్ (జీఐఎస్) ఐఐటీ బొంబాయి, విద్యాశాఖ, భారత ప్రభుత్వం (ఎన్ఎంఈఐసీటీ) ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ జియోస్పేషియల్ అవా ర్డ్ 2025 (ఎడిషన్ 02)లో రెండు అవార్డులు లభించాయన్నారు. ఇవి నేషనల్ జియోస్పేషియల్ పాలసీ 2022, ఇండియన్ స్పేస్‌పాలసీ 2023కు అనుగుణంగా జియోస్పేషియల్ వినియోగాన్ని ప్రోత్సహించడానికి గుర్తింపుగా నిలుస్తాయని తెలిపారు.

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కావాలి

» సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రు

రుద్రంపూర్, (సింగరేణి) జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి అందరి లక్ష్యం కావాలని సింగరేణి సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రు అన్నారు. నాణ్యతతో కూడిన బొగ్గును ఉత్పత్తి చేయడం ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు. గురువారం కొత్తగూడెం ఏరియాలోని పలు మైన్స్, ఓపెన్‌కాస్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజరు షాలెం రాజు డైరెక్టర్ (పా)కు స్వాగతం పలికారు. ఓపెన్‌కాస్టులో బొగ్గు ఉత్పత్తి, రవాణా, లోడింగ్ తదితర అంశాలపై జీఎంను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి గ్రేడ్‌లను ఉత్పత్తి చేయడం ద్వారా నాణ్యమైన బొగ్గును రవాణా చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి, అధికారులు సూర్యనారాయణ రాజు, ప్రహ్లద్, నర్సింహారావు, సోమశేఖర్, మోహన్‌రావు, యోహన్ తదితరులు పాల్గొన్నారు.

పురుషోత్తపట్నంలోని భూములన్నీ రామయ్యవే..

(5వ పేజీ తరువాయి)

అధికారులు వివరించారు. అక్కడి నుంచి వారు పురుషోత్తపట్నం గ్రామం వెళ్లి స్థానికులతో సమావేశమై వివరాలు తెలుసుకున్నారు.

పురుషోత్తపట్నంవాసులు ఏమన్నారంటే..

సుమారు ఎనిమిది దశాబ్దాలకు పైగా తాము ఇక్కడ నివసిస్తున్నామని స్థానికుడు కుందూరు రామిరెడ్డి పేర్కొన్నారు. అన్యమతస్థుల పట్ల చూపిన చొరవ రైతుపై చూపడం లేదని, 1998లో అన్యమతానికి చెందిన పాఠశాల నిర్మాణానికి 12.50ఎకరాలను ఏ విధంగా అమ్మారని, హిందువులమైన రైతులుగా ఉన్న తమను దొంగలుగా, ఆక్రమణదారులుగా ప్రస్తావిస్తుండటం భరించలేకపోతున్నామని సాధు పరిషత్ వారి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. 2002లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం రామయ్య భూములను నాలుగు కేటగిరీలుగా విభజించి విక్రయించేందుకు ప్రయత్నించిందన్నారు. నాటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కూడా ఈ విషయం తెలుసని, ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫైలు ప్రభుత్వం వద్దే పెండింగులో ఉందన్నారు. రికార్డుల పరంగా తాము ఆక్రమణదారులమని తేలిస్తే ఈ క్షణమే భూ ములను వదిలిపెట్టి పోతామని స్పష్టం చేశారు. ఏపీ సాధు పరిషత్ సభ్యుల రాక నేపథ్యంలో భద్రాచలంలో ఇక్కడి పోలీసులు, పురుషోత్త పట్నంలో ఏపీ పోలీసులు బందోబస్తు నిర్వహి ంచారు. అలాగే తెలంగాణ నిఘా వర్గాలు ఈ పర్యటనపై వివరాలు సేకరించినట్టు సమాచారం

అన్యమతానికి రామయ్య భూములు కేటాయిస్తూ జీవో ఎవరు ఇచ్చినా తప్పే

బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,
బీజేపీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు

అన్యమతానికి రామయ్య భూములు కేటాయిస్తూ జీవో ఎవరు జారీ చేసినా తప్పే. దేవాదాయ శాఖ చట్టం ప్రకారం రామయ్య భూ ములు ధారాదత్తం చేసే అధికారం ప్రభుత్వానికి లేదు. రాష్ట్రం ఆవిర్భవించిన అనంతరం పదేళ్లు పాలించినా బీఆర్ఎస్ ఎందుకు జీవో రద్దు చేయలేదు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వాలకు ఇంతకాలం ఇంతటి ప్రధాన సమస్యను ఎందుకు నివేదించలేదు. గత ప్రభుత్వ హయాంలో 2017 నుంచే రామయ్య భూముల్లో సమస్య వచ్చింది. అంతకు ముందు స్థానికులు దేవస్థానానికి డ్యామేజీ చార్జీలు చెల్లిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో అప్పటి ప్రభుత్వానికి చెందిన కొందరు నాయకుల ప్రోద్బలంతో దేవస్థానానికి డ్యామేజీ చార్జీలు చెల్లించడం మానేశారు. డబ్బులు చెల్లిస్తే ఇంత వరకు వచ్చేది కాదు. ఇటీవల అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్టు ఆరోపణలున్నాయి. పురుషోత్తపట్నంవాసులకు భూములను అనుభవించడమే తప్ప వారికి ఈ భూమి మీద హక్కు ఉండదు.

ముందుగా అన్యమతానికి చెందిన నిర్మాణాన్ని తొలగించండి

● ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద,



మాట్లాడుతున్న శ్రీనివాసానంద

ఇక్కడి రైతులు రాములవారిని నమ్ముకొని భూముల్లో దశాబ్దాలుగా వ్యవసాయం చేసుకుంటున్నారని, అన్యమతానికి చెందిన వారికి భూ ములను ఎలా కట్టబెట్టారని, ఆ నిర్మాణాలను తొలగించి స్థానికుల జోలికి రావాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద దేవాదాయశాఖను డిమాండ్ చేశారు. రాముడి భూమి ఎప్పటికైనా రామ సేవకులకే చెందుతుందని, ఈ వివాదంపై రెండు ప్రభుత్వాలతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అన్యమత నిర్మాణాలపై న్యాయస్థానాన్ని ఎందుకు ఆశ్రయించలేదని, కమిటీగా ఏర్పడి ప్రభుత్వం, న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లాలని దేవాదాయశాఖకు సూచించారు. హింసా మార్గం వద్దని, రామ భక్తులకే రామయ్య భూములపై హ క్కుంటుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా సాధు పరిషత్ నాయకులు మాటల పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన తెలంగాణ రాష్ట్రానికి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న వీహెచ్‌పీ నాయకులు ఆ సమావేశం నుంచి బయటకొచ్చారు. అనంతరం సా ధు పరిషత్ సభ్యులు భద్రాచలం చేరుకుని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రామ య్య భూముల్లో వివాదాన్ని శాంతియుత మార్గంలో పరిష్కరించేలా చూస్తామన్నారు. సున్నితమైన ఈ సమస్యకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి స్టీరింగ్ కమిటీ ఎంతో అవసరమని తెలిపారు. రామున్ని దూషించే వారికి భూము లు ఎలా కట్టబెట్టారని ప్రశ్నించారు. అన్యమతానికి కేటాయించిన భూమి అనంతరం చేపట్టిన నిర్మాణాల విషయం ఇరు రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని, గతంలో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం అన్యమతానికి రామయ్య భూములను కేటాయిస్తూ జారీ చేసి న జీవోను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ఏపీ ప్రభుత్వం ఇందుకు సహకరించాలని, లేదంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, ఇద్దరు సీఎంలు రామ భక్తులని, వారికి పూర్తి అవగాహన ఉందని భావిస్తున్నామన్నారు.

మిర్చి.. సాగు తగ్గుతోంది

(5వ పేజీ తరువాయి)

ధర లేక రైతులు నష్టపోయారు. క్వింటాకు మార్కెట్‌లో జెండాపాట రూ.13వేలు పలికినా.. నాణ్యత లేదంటూ క్వింటాకు రూ.8 వేల నుంచి 10వేలకు కొనుగోలు చేశారు. ఈ పరిస్థితి వల్ల సొంత భూమి రైతులకు కొంత లాభాలు లేకపోయినా.. నష్టం లేకుండా చూడగలిగారు. కౌలు రైతులు మాత్రం దారుణంగా దెబ్బతిన్నారు. మిర్చి సాగు చేయడంతో పాటు కోతల కోసం చత్తీష్‌గఢ్, మహారాష్ట్ర, ఏపీ, బీహార్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వలస కూలీలను రప్పించి వారికి వసతి, ప్రయాణ ఖర్చులు ఇచ్చి కోతలు కోయించే పరిస్థితి ఉంది. ప్రతీ సీజన్‌లో సుమారు 70వేల నుంచి 80వేల మందికి పైగా కూలీలు వలస రావడం, మిర్చి కోతలు కోయడం జరిగింది. ఇటీవల కాలంలో కూలీల కొరత కూడా రైతులకు శాపంగా మారింది. మిర్చికోతలు, గ్రేడింగ్‌కు కూలీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు పంటకు ధర లేక కూలీ ధరల భారం మోయలేక రైతులు మిర్చిసాగంటే భయపడే పరిస్థితి ఉంది. దశాబ్దాలుగా మిర్చిసాగులో అగ్రగామిగా ఉన్న ఉమ్మడి జిల్లాలో ఈసారి సగానికి సగం మిర్చి పంట పడిపోబోతుంది. తద్వారా జిల్లా వ్యవసాయ రంగంపై కూడా కీలక ప్రభావం చూపనుంది. వాణిజ్యపంటగా జిల్లాలో వేలాది కోట్ల రూపాయల టర్నోవర్‌కు మిర్చిసాగు ఉపయోగపడడంతో పాటు రైతులకు లాభాలపంటగా కూలీలకు ఉపాధి పంటగా ఇప్పటి వరకు గుర్తింపు ఉంది. మారిన ధరల పరిస్థితితో మిర్చిసాగు ఈఏడాది దారుణంగా పడిపోతుంది.

ప్రత్యామ్నాయం వైపు రైతుల చూపు

ఉమ్మడి జిల్లాలో మిర్చికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, పత్తి పంటలపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. దీనికితోడు ప్రైవేటు హైబ్రిడ్ కంపెనీల రైతులతో ఒప్పందాలు చేసుకుని మొక్కజొన్న సీడ్ ఉత్పత్తి సాగు చేయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో ఈ సీజన్‌లో మొక్కజొన్న వేశారు. ఇందులో భద్రాద్రి జిల్లాలో అత్యధికంగా సాగవుతోంది. ఖమ్మం జిల్లాలో ఆగస్టు నెలలో ఎక్కువగా మొక్కజొన్న వేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీనికితోడు ఆయిల్‌పామ్ వంటి పంటల పైనా రైతులు మక్కువ చూపుతున్నారు. మిర్చి సాగు కంటే మొక్కజొన్న సాగు లాభసాటిగా ఉందని రైతులు చెబుతున్నారు. మిర్చి ధరలు పెరగకపోతే క్రమంగా జిల్లా రైతు మిర్చి సాగుకు దూరమయ్యే అవకాశం ఉంది. చైనా, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో కూడా మిర్చి సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇచ్చి పండిస్తుండడంతో.. ఎగుమతి ఆర్డర్లు కూడా తగ్గుతున్నాయి. దీనికి తోడు మిర్చి పంటకు అత్యధికంగా క్రిమిసంహారక మందులు వేయడంతో విదేశాలు ఇక్కడ మిర్చిని దిగుమతి చేసుకు నేందుకు ముందుకు రావడం లేదు. ఈ పరిణామాలు కూడా మార్కెట్ పై ప్రభావం చూపుతున్నాయి.

అన్నదాతకు అండగా.. రుణమాఫీ

» రూ.2లక్షల లోపు రుణాల రద్దు పథకానికి నేటికి ఏడాది
» ఖమ్మం జిల్లాలో 1,31,760, భదాద్రిలో 55,983మందికి లబ్ధి

ఖమ్మం, జూలై 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రూ.2 లక్షలలోపు రైతులకు రుణాలను మాఫీ చేస్తామన్న కాంగ్రెస్.. రేవంత్ నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని నెరవేర్చింది. సరిగ్గా ఏడాది క్రితం జూలై 18న ఈ రుణమాఫీని అమలు చేసింది. అయితే రూ.2 లక్షల లోపు రుణాలున్న రైతులకు ఈ పథకం వర్తించగా.. రూ.2లక్షలకు పైన ఉన్న వారికి వర్తించకపోవడంతో వారంతా ఇంకా ఆశగా ఎదురు చూస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 1,31,760 మంది రైతులకు రూ.912.10కోట్లకు పైగా, భద్రాద్రి జిల్లాలో 55,983మందికి రూ.415.34 కోట్ల పైచిలుకు మాఫీ అయ్యింది. ఇంత పెద్దమొత్తంలో రుణమాఫీ ఒకేసారి కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రూ.లక్ష రుణమాఫీకి నాలుగు విడతలుగా చేయడం, అది కూడా వడ్డీభారంతో సక్రమంగా అమలుకు నోచుకోలేకపోయింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఒకేసారి రూ.2లక్షలలోపు రుణమాఫీ చేయడంతో చాలామంది రైతులు అప్పుల గండం నుంచి బయటపడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజె న్సీ రైతులు, పోడు రైతులు కూడా ఇందులో లబ్ధిపొందారు. ఇక రూ.2లక్షలపైబడి రుణం ఉన్న రైతులకు మాఫీ విషయంలో ప్రభుత్వం ఎలాంటి హామీ ఇవ్వడంలేదు. ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల్లోపు వారికి మాఫీచేశామని, అంతకు మించి ఉన్నవారికి మాఫీ అయ్యే అవకాశం లేదని అనధికారికంగా అధికారులు చెబుతున్నారు.

మన్మోహన్‌సింగ్ పేరుతో..

» ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీకి పేరు ఖరారు

(5వ పేజీ తరువాయి)

జియోఫిజిక్స్, జియో కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్‌సైన్స్ అనే కోర్సులను సైతం అధికారులు అమలు చేయనున్నారు. అయితే వీటికి అనుమతులు రావాల్సి ఉండడంతో.. విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. 1994కి ముందు ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో మైనింగ్ ఇంజనీరింగ్ కళాశాలకు అనుబంధంగా జియాలజీ పోస్టు గ్రాడ్యుయేషన్ సీట్లు 20 ఉన్నాయి. ఈపీజీ జియాలజీని కొత్తగూడెం పరిధిలోని రుద్రంపూర్‌లో ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకు పీజీ సెంటర్‌ను హైదరాబాద్‌కి మార్చారు. అయితే కొత్త యూనివర్సిటీ అకాడమిక్, హాస్టళ్ల ప్రయోగశాలల ఏర్పాటుకు కనీసం రూ.500కోట్ల నిధులు అవసరం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. జియాలజీ, జియోఫిజిక్స్, జియో కెమిస్ట్రీ ప్రయోగశాలలకు ఆధునిక పరికరాల అవసరం ఉంటుంది.

అపర భగీరథుడు మంత్రి తుమ్మల

కొత్తగూడెం మైనింగ్ ఇంజనీరింగ్ కళాశాలలో అన్ని రంగాల కోర్సుల ఏర్పాటు కోసం 1988వ సంవత్సరం నుంచే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి చేస్తున్నారు. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో రోడ్లు భవనాల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో కళాశాల సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే కాకుండా కళాశాలను యూనివర్సిటీగా మార్చాలనే కోరిక ఉండేది. ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తిరిగి ఈ యూనివర్సిటీపై దృష్టి పెట్టి.. ఎట్టకేలకు సాధించారు. కాగా.. నూతన డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ ఏర్పాటు కోసం మంత్రి తుమ్మల చేసిన కృషిని విద్యార్థి లోకం అభినందిస్తోంది.

అనుమతుల కోసం ఎదురుచూపు

● టి. జగన్‌మోహన్‌రాజు, ప్రిన్సిపాల్

డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణకు హైయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ యోగితారాణా వైస్ చాన్స్‌లర్‌గా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాగానే కొత్త కోర్సులు ప్రారంభమవుతాయి. నూతన భవనాలు, ప్రయోగశాలలు, హాస్టల్ భవనాలు, బోధనా, బోధనేతర సిబ్బంది, ఇతరాత్ర సౌకర్యాల అవసరం ఉంటుంది. అందువల్ల ప్రభుత్వం నుంచి అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాం.



ప్రమాద బీమా చెక్కు అందించిన సీపీ



ఖమ్మంఖానాపురంహవేలి,జూలై17(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రమాదవశాత్తూ హోంగార్డు గంటా. నరేష్ కుమార్ మృతి చెందారు. ఆ కుటుంబానికి జీతం అకౌంట్‌తో వచ్చే ప్రయోజనాలు, బీమా సొమ్ము రూ.32లక్షల చెక్కును గురువారం పోలీస్ కమిషనర్ సునిల్ దత్ మృతుడి భార్య నాగరాణికి అందించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, ఆర్ఐ సురేష్, హోంగార్డ్స్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు బంక. శ్రీను, వెంకటేశ్వర్లు, రవిబాబు, నాగరాజు పాల్గొన్నారు.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- భయం గుప్పిట్లో సిబ్బంది




తిరుమలాయపాలెం రెవెన్యూ కార్యాలయం, పెచ్చులూడుతున్న స్లాబ్

తిరుమలాయపాలెం, జూలై17(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. సుమారు 20ఏళ్ల క్రితం ఈభవనం నిర్మించడంతో పాతబడింది. కూలేందుకు సిద్ధంగా ఉంది. భవనం శిథిలావస్థకు చేరుకుంది.పైకప్పు పెచ్చులు లేచి అధ్వానంగా ఉంది. రెవెన్యూ సిబ్బంది నిర్వహించే టెలికాన్ఫరెన్సు కార్యాలయంలో శిథిలావస్థకు చేరి వర్షం కురుస్తుంది. అలాగే రికార్డు రూంలో కూర్చుని సిబ్బంది పని చేద్దామంటే పైపెచ్చులూడి ఎప్పుడు మీద పడతాయోనని భయంతో ఉన్నారు. అలాగే ఆయాగ్రామాలనుంచి భూమి రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన రైతులు వర్షం వస్తే స్లాబు కురుస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయంలో రికార్డులు కూడా వర్షం వస్తే తడిచే ప్రమాదం ఉంది. ఈవిషయమై గ్రామస్తులు పలు మార్లు రెవెన్యూ జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితంలేదని చెబుతున్నారు. సిబ్బంది కూడా కార్యాలయం వచ్చి పని చేసేందుకు భయపడుతున్నారు.

స్థానిక ఎన్నికల్లో అన్నిస్థానాల్లో సీపీఎం పోటీ

పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్



మాట్లాడుతున్న బండి రమేష్

కూసుమంచి, జూలై 17(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో సీపీఎం స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తుందని పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ తెలిపారు. గురువారం కూసుమంచి పార్టీ కార్యాలయంలో కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. పోరాటాల పురిటిగడ్డ పాలేరు నియోజకవర్గంలో అన్నిస్థానాల్లో పోటీ చేస్తుందని, ప్రజలు పనిచేసే నాయకుల్ని కోరుకుంటున్నారని రమేష్ చెప్పారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా సీపీఎం శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి తొటకూరి రాజు, మల్లెల షన్మతిరావు, గంగాధర్, రమణారెడ్డి, గురుమూర్తి, గన్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

యాసంగి బోనస్‌పై మంత్రికి వినతి

యాసంగిలో రైతులకు సన్నవడ్లకు ఇస్తామన్న బోనస్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని బండి రమేష్ డిమాండ్ చేశారు. కూసుమంచిలో డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు పంపిణీ చేసేందుకు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. గతవానాకాలం, యాసంగిలో రైతులనుంచి సేకరించిన ధాన్యానికి నేటివరకు బోనస్ ఖాతాల్లో జమకాలేదని, రైతులకు రుణమాఫీ పూర్తిస్థాయిలో వర్తించలేదని వాటిని కూడ విడుదల చేయాలని కోరారు. యూరియా కొరత లేకుండా చూడాలన్నారు.

ఆర్థిక క్రమశిక్షణలో ఆదర్శం

- రూ.6 లక్షలు రుణం పొందిన దివ్యాంగుల ఎస్‌హెచ్‌జీ
- ఖమ్మంలో రికార్డు స్థాయిలో అధిక రుణం తీసుకున్న దివ్యాంగులు
- చెక్కు పంపిణీ చేసిన మెప్మా పీడీ, కేఎంసీ కమిషనర్ అభిషేక్



చెక్కు పంపిణీ చేస్తున్న మెప్మా పీడీ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం కార్పొరేషన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): శారీరకంగా వైకల్యమైనా ఆర్థిక క్రమశిక్షణలో వారికి వారే చాటి. నగరంలో కొందరు వికలాంగులు స్వయం సహాయక సంఘంగా ఏర్పడ్డారు. రుణాలు పొందారు. క్రమపద్ధతిలో బ్యాంకులకు తిరిగి చెల్లింపులు చేసుకుంటూ అధికారుల మన్నలు పొందారు. ఆర్థికంగా తమ కుటుంబాలను బలోపేతం చేస్తూ రుణాలను ఇప్పించిన మెప్మాకు బ్యాంకులకు మంచి ఖ్యాతి తెచ్చారు. ఖమ్మం నగరంలోనే అత్యధిక రుణం తీసుకున్న దివ్యాంగుల సంఘంగా గుర్తింపు పొందారు. రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు.

రూ.6లక్షల రుణం వరకు

ఖమ్మంలోనిఖానాపురం ప్రాంతానికి చెందిన దివ్యాంగులు గొడుగు రామకృష్ణ, ఎస్కే పీర్‌సాహెబ్, అక్కి. వెంకటనారాయణ, నారబోయిన సైదులు తుమ్మెట్ల ధనలక్ష్మీ, తుమ్మట్ల సుభద్ర, తుమ్మట్ల మంగమ్మ 2017లో బాలాజీ దివ్యాంగుల స్వయం సహాయక సంఘంగా ఏర్పడ్డారు. ఖమ్మం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో నమోదు చేయించుకున్నారు. తొలివిడతగా స్థానికంగా ఉన్న గ్రామీణ బ్యాంకు నుంచి ఏడుగురు సభ్యులు రూ.1లక్ష రుణం తీసుకున్నారు. వాటిలో కిరాణం, ఫొటోస్టూడియో, పాడిగేదలు, ఇలా చిన్న చిన్న వ్యాపారాలను ప్రారంభించారు. 2019లో తీసుకున్న రుణాలు తిరిపోవటంతో మళ్లీ రూ.2లక్షల రుణాలను తీసుకున్నారు. వాటిని చెల్లింపులుచేశారు. మూడోసారి 2020లో రూ.6లక్షల రుణం తీసుకున్నారు. అయితే ఏడుగురు సభ్యుల్లో ఒక సభ్యుడి సక్రమంగా చెల్లించకపోవటంతో సంఘం నిర్వాహణ ఇబ్బందిగా మారింది. అయినా మిగతా సభ్యులు చెల్లించి బకాయలు లేకుండా చేశారు. ఇప్పుడు నాల్గో సారి ఇల్లెందు క్రాస్ రోడ్డులోని తెలంగాణ గ్రామీణ వికాస బ్యాంకు నుంచి మరోసారి రూ.6 లక్షల రుణాన్ని పొందారు.

చెక్కు పంపిణీ చేసిన కమిషనర్

దివ్యాంగుల స్వయం సహాయక సంఘం 8ఏళ్లుగా ఆర్థిక క్రమశిక్షణతో కొనసాగించటంపై మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య బాలాజీ దివ్యాంగుల స్వయంసహాయక సంఘాన్ని అభినందించారు.గురువారం కేఎంసీ కార్యాలయంలో టీఎంపీ గుడిపూడి సుజాతరాణి, బ్యాంకు మేనేజరు కే.కమలపణి ఆధ్వర్యంలో కేఎంసీలో చెక్కు అందజేశారు. కమిషనర్ దివ్యాంగులతో విడివిడిగా మాట్లాడారు. భవిష్యత్‌లో మంచిగా వ్యాపారాలు చేస్తూ రూ.20 లక్షల రుణాలు తీసుకునే స్థాయి వరకు వెళ్లాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ సయ్యద్ సల్మా, ఆర్పీ వనకడపల ఝాన్సీ పాల్గొన్నారు.

హార్వెస్ట్, సెడార్‌వ్యాలీ విద్యార్థినుల ప్రతిభ

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రజత పతకాలు



విద్యార్థినులను అభినందిస్తున్న రవిమారుత్, పార్వతీరెడ్డి

ఖమ్మంస్పోర్ట్స్, జూలై17(ఆంధ్రజ్యోతి): ఈనెల 9 నుంచి 12 వరకు మంచిర్యాలలోని రామక్రిష్ణాపురంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో హార్వెస్ట్ పాఠశాలకు చెందిన ఎమ్. చార్విత,సెడార్‌వ్యాలీ పాఠశాల విద్యార్థిని శ్రీధాత్రి ప్రతిభ చూపారు. రజత పతకాలు సాధించారని పాఠశాల యజమాన్యం తెలిపింది. చార్విత ఈనెల4న జరిగిన జిల్లా స్థాయి ఎంపికలలో ప్రతిభచూపిరాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి, అభినందించారు.భవిష్యత్ పోటీలలో రాణించి జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

హామీలను నెరవేర్చాలి

తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఖమ్మంలో ర్యాలీ నిర్వహించారు అక్కడ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. తెలంగాణ ఉద్యమంలో అనేకమంది తమప్రాణాలను బలిదానాలు చేశారన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్‌పాలనలో ఉద్యమకారుల ఆశలను వమ్ము చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫేస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. తక్షణమే ఉద్యమకారులకు కార్పొరేషన్ ఏర్పాటుచేసి హామీల అములుకు శ్రీకారం చుట్టాలన్నారు. రాష్ట్రసాధనలో క్రియాశీలకంగా పనిచేసిన కళాకారులకు ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధిఅవకాశాలు కలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబాల రామారావు, పాలకుర్తి కృష్ణ, అంగిడి బిక్షం, ఎస్కేఫక్రుద్దీన్, ఉల్లోజు వెంకన్న, వి.రాజేష్‌నాయక్ పాల్గొన్నారు.

యువతను తప్పుదోవ పట్టిస్తున్న పాలకులు

ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి

ఖమ్మంరూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాయమాటలతో ఎప్పటికప్పుడు యువతను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర అన్నారు. మండలంలోని ముత్తగూడెంలో అఖిల భారత యువజన సమాఖ్య 13వ మండల మహాసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ ఏఐవైఫ్ పోరాటాల ఫలితంగా యువతకు అనేక హక్కులు లభించాయన్నారు. భారతదేశంలో 60శాతం ఉన్న యువతను పాలకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పక్కదారి పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామాల్లో సైతం గంజాయి, డ్రగ్స్ వ్యాప్తిలో పాలకుల నిర్లక్ష్యం ఉందన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను విమర్శించారు. అనంతరం మండల అధ్యక్ష, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దినేని కర్ణకుమార్, నాయకులు రవి, శ్రీనాథ్ రెడ్డి, మహ్మద్ మౌలానా, దండి సురేష్, గౌస్‌పాషా, చిన్న వెంకటరెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.

మంచితనానికి మారుపేరు యాకూబ్



నివాళులు అర్పిస్తున్న యరగర్ల

ఖమ్మంమార్కెట్, జూలై17(ఆంధ్రజ్యోతి): మంచితనానికి మారుపేరుగా యాకూబ్ నిలిచారని మార్కెట్ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు పేర్కొన్నారు. గురువారం మార్కెట్‌లో కమీషన్ వ్యాపారి యాకూబ్ దశదినఖర్మకు హాజరయ్యారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు యాకూబ్ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ తల్లాడ రమేష్, ఆత్మ కమిటీ ఛైర్మన్ దిరిశాల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు సాదు రమేష్‌రెడ్డి, డైరుక్టర్లు రెంటాల ప్రసాద్, లతీఫ్, పోలూరి రమేష్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయాధికారి

ఖమ్మంలీగల్,జూలై17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి కె.వి. చంద్రశేఖరరావు పేర్కొన్నారు. నగరంలోని దానవాయిగూడెంలో గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికలు వారి చుట్టూ మరియు జరుగుతున్న అకృత్యాలపై అప్రమంతంగా ఉండాలని సూచించారు. గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఎవరైనా ఏదైనా కేసులో బాధితులు అయితే వారికి ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని అలాగే ప్రభుత్వ పథకాలకు అనాథ కలిగిన పేదలకు అందేలా చూస్తామని తెలిపారు. నిర్భయ చట్టం గురించి వివరిస్తూ ఫోన్లకు ఆకర్షితులు కావద్దని, శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయదుర్గ, పారాలీగల్ వాలెంటరీలు నాగమణి, కోమలత పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించాలని ఆందోళన



ధర్నా చేస్తున్న విద్యార్థులు

తిరుమలాయపాలెం, జూలై17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ ఉపకార వేతనాలు చెల్లించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఖమ్మం-వరంగల్ రాష్ట్రీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. నాలుగేళ్లుగా ఫీజురీయింబర్సుమెంట్, ఉపకార వేతనాలు ప్రభుత్వం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ మాట్లాడుతూ మండలంలోని పిండిప్రోలు కళాశాలలో విద్యార్థులకు సరిపడా వసతులు లేవని,నూతనభవనాలు నిర్మించాలని కోరారు. ఈకార్యక్రమంలో అజయ్, శ్రీకాంత్, వంశీ,నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

ముదిగొండ,జూలై17(ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ముదిగొండ మండలం పమ్మి గ్రామం వద్ద గురువారం సాయంత్రం సంభవించింది.స్థానికుల వివరాల ప్రకారం.. చింతకాని మండలం తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన కొమ్ము బాలస్వామి(52) ద్విచక్రవాహనంపై పమ్మిలోని సోదరి వద్దకు వచ్చి వెళుతున్నాడు. ఈక్రమంలో అతివేగంగా ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఆయన్ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బస్టాండ్‌లలో తనిఖీ



నూతన బస్టాండ్‌ను పరిశీలిస్తున్న రవీందర్

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సిటీ బస్టాండ్, నూతన బస్టాండ్‌లను గురువారం కరీంనగర్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి రవీందర్ ఆకస్మిక తనిఖీ చేశారు. బస్టాండ్ ఆవరణలోని పలుషాపుల్లో అధిక రేట్లు ఎమ్మార్పీ కంటే అధికంగా అమ్ముతున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేశారు. మూత్రశాలలు శుభ్రత, యూజర్ చార్జీల వసూళ్లపై తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ దినేష్‌కుమార్,ట్రాఫిక్‌సీఐ రామయ్య, స్టేషన్‌మేనేజర్, సెక్యూరిటీ,విజిలెన్స్ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫారెస్టు సిబ్బందిపై దాడి.. 16మందిపై కేసు

కారే పల్లి,జూలై 17(ఆంధ్ర జ్యోతి): మండలపరిధిలోని ఎర్రబోడు,మాణిక్యారం, ఊటవాగు ప్రాంతంలో బుధవారం జరిగిన పోడుభూమి ఘర్షణలోఫారెస్టు సిబ్బందిపై దాడికి పాల్పడిన ఇద్దరు సీపీఎం నాయకులతోపాటు 16మందిపై కేసు నమోదైంది. బిట్‌అధికారి శిల్ప ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అర్హులందరికీ ఇళ్లు, రేషన్ కార్డులిస్తున్నాం

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపులఏర్పాటు గత ఇందిరమ్మ హయాంలోనే జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఇప్పుడు మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. సత్తుపల్లి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా తన అభ్యర్థన మేరకు అదనంగా మరో1,500 ఇళ్లను మంత్రి పొంగులేటి కేటాయించారన్నారు.

పొదుపుతో మహిళలకు ఆర్థిక స్వావలంబన అదనపు కలెక్టర్ శ్రీజ

మగవారు చదువుకుంటే అక్కడితోనే ఆగిపోతుందని, అదే మహిళ చదువుకుంటే కుటుంబ సభ్యులంతా విద్యాధికులు అవుతారని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పీ.శ్రీజ అన్నారు. ఆర్టీసీ బస్సులు, మహిళా మార్ట్, డెయిరీ షెడ్డలను ఏర్పాటు చేయించామని, ఈ ఆర్థిక స్వావలంభన మహిళల పొదుపుతోనే సాధ్యమైందన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో జయశ్రీ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీలత, కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్‌గౌడ్, జిల్లా క్రీడలు, యువజన సంక్షేమ శాఖ అధికారి పీ.సునీల్‌రెడ్డి, జిల్లా పంచాయితీ అధికారి ఆశాలతలతో పాటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కూసుమంచిలో చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి, జూలై17 (ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, వారు ఆత్మగౌరవంతో జీవించాలన్నదే తమ లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం కూసుమంచిలో జరిగిన పాలేరు నియోజకవర్గస్థాయి మహిళాశక్తి సంబురాల్లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్‌తో కలిసి పాల్గొన్న మంత్రి మహిళలకు వడ్డీలేని రుణాల చెక్కులు, రుణబీమా, ప్రమాద బీమా చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా జరిగిన పొంగులేటి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలను నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. కానీ తమ ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. అద్దె బస్సులు, పెట్రో పంపులు, ధాన్యం కొనుగోళ్లు, రైస్ మిల్లులు లాంటి వ్యాపారాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత పాలకులు నిర్లక్ష్యం చేసిన వడ్డీలేని రుణాలను పునరుద్ధరిస్తున్నట్టు తెలిపారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పొంగులేటి

ఖమ్మంరూరల్: రోడ్డుప్రమాదంలో గాయపడిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. రూరల్‌మండలం,మద్దులపల్లి గ్రామానికి చెందిన నల్లపునేని రాజా అనే వ్యక్తి గ్రామంలో నుంచి స్టేజివద్ద తన ఇంటికి వెలుతున్నాడు. ఈక్రమంలో ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనదారుడు రాజా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈప్రమాదంలో కాలుకు తీవ్ర గాయాలపాలై రోడ్డు పక్కన పడి ఉన్నాడు. అదే సమయంలో అటుగా వెళుతున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మద్దులపల్లి రోడ్డు పక్కన పడి ఉన్న రాజాను గుర్తించారు. కారుదిగి పోలీస్ వాహనంలో అతడిని ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అతనికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

బాలల్లో సృజనాత్మకతను పెంచాలి

- అదనపు కలెక్టర్ శ్రీజ



సత్తుపల్లిలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న శ్రీజ

సత్తుపల్లిరూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యావిధానం సాఫల్యతగానీ, వైఫల్యంగానీ ఉపాధ్యాయుడు అనుసరిస్తున్న బోధన పద్ధతిపై ఆధారపడి ఉంటుందని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. సత్తుపల్లి పట్టణంలోని బాలికోన్నత పాఠశాలతో పాటు మండలంలోని రేజర్లలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయుడికి విషయ పరిజ్ఞానంపై ఉన్నపట్టు, బోధనా నైపుణ్యం,బోధన అభ్యాసకుని స్థాయిని, అభిరుచి, పూర్వజ్ఞానాన్ని, అభ్యాసకునిలోని ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకుని విద్యా బోధన ప్రక్రియ కొనసాగాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని వివిధ కార్యక్రమాలతో పాటు మౌలిక వసతులను పరిశీలించి ఎంఈవో నక్కా రాజేశ్వరరావుకు పలు సూచనలు చేశారు.

‘ఆయిల్‌పామ్’ను సందర్శించిన శాస్త్రవేత్తలు

సత్తుపల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆయిల్ పామ్ తోటలను భారతీయ ఆయిల్‌పామ్ పరిశోధనా సంస్థ (ఐఐఓఆర్) శాస్త్రవేత్తలు సందర్శించారు. మొక్కలను పరిశీలించి నమూనాలు సేకరించారు. గురువారం సత్తుపల్లి మండలం నారాయణపురం, పాకలగూడెం, గౌరిగూడెం గ్రామాల్లోని ఆయిల్‌పామ్ తోటలను శాస్త్రవేత్తలు డాక్టర్ ఎంవీ.ప్రసాద్, డాక్టర్ రామచంద్రుడు, డాక్టర్ కళ్యాన్‌బాబు, ఆయిల్‌ఫెడ్ ఓఎస్‌డీ డాక్టర్ అడపా కిరణ్ పరిశీలించారు. వీరి వెంట ఖమ్మం ఉద్యానవనశాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్, జిల్లా ఆయిల్‌ఫెడ్ ఇన్‌చార్జి శంకర్‌లు ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 29 మంది రైతులకు సంబంధించిన తోటల్లో మొక్కలను పరిశీలించాలని ఆయిల్‌ఫెడ్ పెదవేగిలోని ఐఐఓపీఆర్‌కు లేఖరాసింది. ఈ మేరకు ముగ్గురు శాస్త్రవేత్తలతో కమిటి నియమించగా వారు ఈనెలమొదటి వారంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు బుధ, గురువారాల్లో ఖమ్మం జిల్లాలో తోటలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు 80 ఎకరాల్లో మొక్కలు పరిశీలించి నమూనాలు సేకరించారు. 65 నమూనాలు సేకరించామని వీటిని శాస్త్రీయంగా అధ్యయనం చేసిన తరువాత ఆయిల్‌ఫెడ్‌కు నివేదిక సమర్పిస్తామని చెప్పారు. ఆయిల్‌పామ్ మొక్కల్లో ఏవైన లోపాలుంటే అందుకు గల కారణాలతో తాము నివేదిక ఇస్తామని దీనిపై ఆయిల్‌ఫెడ్ మాత్రమే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈరకంగా తాము అధ్యయనం చేయడం రాష్ట్రంలో మొదటిసారి అని అన్నారు. హాఫ్‌టైప్ మొక్కల వల్ల రైతులు నష్టపోయారని వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయిల్‌ఫెడ్ శాస్త్రవేత్తలకు లేఖ రాసినట్లు తెలిసింది.



కిష్టారం విద్యార్థికి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు

సత్తుపల్లి, జూలై17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మొగిలి సంతోష్ బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించాడు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో సంతోష్‌ను అభినందిస్తూ మిఠాయిలు తినిపించారు. 2వ విడతలో సీటు సంపాదించిన సంతోష్ తెలుగుమీడియంలో చదువుతూ 10వ తరగతిలో 544మార్కులు సాధించినట్లు హెచ్ఎం సయ్యద్ సమద్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రియాజుద్దీన్, ఆదిశేషుకృష్ణ, రత్నారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకల పంపిణీ

సత్తుపల్లిరూరల్, జూలై17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్దారం రోడ్డులోని దివ్యాంగుల సేవా ఆశ్రమం ఆధ్వర్యంలో స్థానిక జవహర్‌నగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్, వెంగళరావు నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను ఎంఈవో నక్కా రాజేశ్వరరావు చేతులమీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వల్లపర్ల రవికుమార్‌ను ఎంఈవోతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

రంగమ్మకు సండ్ర నివాళి

తల్లాడ, జూలై17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూతన్‌కల్ గ్రామంలో తూము రంగమ్మకు గురువారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నివాళులర్పించారు. రంగమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రంగమ్మ కుమారులైన సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు, మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావులకు సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ శెట్టిపల్లి లక్ష్మణరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ నాయుడు శ్రీనివాసరావు, పాసంగులపాటి లక్ష్మీనారాయణ, చిట్టా నాగేశ్వరరావు, వేమిరెడ్డి సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలి

» ఉపరితల గనుల్లో జాగ్రత్తలు తప్పనిసరి
» సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రు



సత్తుపల్లిలో ఓసీని పరిశీలిస్తున్న గౌతమ్ పోట్రు

సత్తుపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేస్తూ వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేసేలా తగు చర్యలు తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రు అన్నారు. గురువారం ఆయన సత్తుపల్లిలోని కిష్టారం, జేవీఆర్ ఓసీలను ఆకస్మికంగా సందర్శించారు. సీహెచ్‌పీ లోడింగ్ పాయింట్ వద్దకు చేరుకుని రైలు మార్గం ద్వారా జరుగుతున్న బొగ్గు రవాణా, సైలోబంకర్ నుంచి వెలువడే దుమ్మూధూళిని పరిశీలించిన అనంతరం వ్యూ పాయింట్ల వద్ద ఓసీలను పరిశీలించి పీవోలకు పలు సూచనలు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎటువంటి ఆటంకాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలతో బొగ్గు ఉత్పత్తి చేస్తూ రవాణాలో రోజువారీ లక్ష్యాలను అధికమించాలని కోరారు. అలాగే ఉపరితల గనుల్లో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. బొగ్గు గ్రేడ్‌లను పరిశీలించి నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలని, రోజువారీ బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ బ్లాస్టింగ్, లోడింగ్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజు, ఎస్‌ఓటూ జీఎం జీవీ.కోటిరెడ్డి, ఏరియా ఇంజనీర్ కే.సూర్యనారాయణరాజు, పీవోలు ఎన్వీఆర్.ప్రహ్లాద్, ఎంవీ.నరసింహారావు, డీజీఎంలు కే.సోమశేఖర్, జీవీ.మోహనరావు, ఎన్.యోహాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు టీడీపీ నాయకుల వినతి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

వైరా, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో అర్హులైన తమ పార్టీ వారికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయించాలని కోరుతూ వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌ను తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను మండల టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కిలారు సురేందర్, గాలి రామకృష్ణ, నాయకులు రాచబంటి కృష్ణయ్య, పమ్మి అర్జున్‌రావు, మన్నేపల్లి ప్రదీప్, చావా కాంతారావు, కోటాదాసు, సత్యం, సతీష్, పర్సా రామకృష్ణ పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



పంచాయతీ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి

పెనుబల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ఇళ్లు ఇస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం పెనుబల్లి మండలం పాతకుప్పెనకుంట్ల గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో రూ.20లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో పేదలకు పక్కా ఇళ్లు మంజూరు చేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడమే కాకుండా ఇతర పథకాలను కూడా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ.. సత్తుపల్లి నియోజకవర్గంలో 3500ఇళ్లు మంజూరు చేయడమేకాకుండా అదనంగా మంత్రి పొంగులేటి సహకారంతో మరో 1500ఇళ్లు మంజూరు చేశారని, అర్హులైన పేదలందరికి ఇళ్లు ఇస్తామన్నారు. కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్, కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజచౌదరి, వైస్‌చైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విశ్వనాథ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరెడ్డి, సోమరాజు సీతరామారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు, రేషన్ కార్డులిస్తున్నాం

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపుల ఏర్పాటు గత ఇందిరమ్మ హయాంలోనే జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఇప్పుడు మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. సత్తుపల్లి నియోజకవర్గానికి 3,500ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా తన అభ్యర్థన మేరకు అదనంగా మరో 1,500 ఇళ్లను మంత్రి పొంగులేటి కేటాయించారన్నారు.

పొదుపుతో మహిళలకు ఆర్థిక స్వావలంబన : అదనపు కలెక్టర్ శ్రీజ

మగవారు చదువుకుంటే అక్కడితోనే ఆగిపోతుందని, అదే మహిళ చదువుకుంటే కుటుంబ సభ్యులంతా విద్యాధికులు అవుతారని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పీ.శ్రీజ అన్నారు. ఆర్టీసీ బస్సులు, మహిళా మార్ట్, డెయిరీ షెడ్డులను ఏర్పాటు చేయించామని, ఈ ఆర్థిక స్వావలంభన మహిళల పొదుపుతోనే సాధ్యమైందన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో జయశ్రీ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీలత, కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్‌గౌడ్, జిల్లా క్రీడలు, యువజన సంక్షేమ శాఖ అధికారి పీ.సునీల్‌రెడ్డి, జిల్లా పంచాయితీ అధికారి ఆశాలతలతో పాటు అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి



కూసుమంచి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, వారు ఆత్మగౌరవంతో జీవించాలన్నదే తమ లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం కూసుమంచిలో జరిగిన పాలేరు నియోజకవర్గ స్థాయి మహిళాశక్తి సంబురాల్లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్‌తో కలిసి పాల్గొన్న మంత్రి మహిళలకు వడ్డీలేని రుణాల చెక్కులు, రుణబీమా, ప్రమాద బీమా చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా జరిగిన పొంగులేటి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలను నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. కానీ తమ ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నామన్నారు. పలువురు అధికారులు,నాయకులు పాల్గొన్నారు.

తిమ్మరావుపేట రోడ్డు గుంతలమయం

» పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



గుంతలమయంగా ఉన్న రోడ్డు

ఏన్కూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు నుంచి వయా తిమ్మరావుపేట మీదుగా ఖమ్మం వెళ్లే రోడ్డు అధ్వాన్నస్థితిలో ఉంది. ఏన్కూరు నుంచి తూతక్క లింగన్నపేట వరకు సుమారు 3కి.మీ. రోడ్డంతా గుంతలమయంగా మారింది. అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గుంతల్లో ద్విచక్రవాహనాలు పడి గాయాలైన సంఘటనలున్నాయి. రాత్రి వేళలో ప్రయాణం ప్రమాదభరితంగా ఉంటుంది. ఇదే రహదారిలో టీఎల్‌పేట వద్ద చప్టా పూర్తిగా శిధిలావస్థకు చేరి ప్రమాదభరింగా మారింది. అయినా సంబంధిత ఆర్అండ్‌బీ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ఈ రహదారి గుండా ఖమ్మం, ఇల్లెందుకు వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రమాదభరితంగా ఉన్న రహదారికి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

తల్లాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఐ.రత్నమనోహర్ అన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఆరోగ్యశిబిరాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో నీటి నిలవల వల్ల దోమలు వృద్ధి చెంది జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు శ్రీకాంత్, గోపి, మహేష్, నిష్మా, విజయ్, సూపర్‌వైజర్ కె.పెద్దపుల్లయ్య, భద్రమ్మ, ఝాన్సీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్టు సిబ్బందిపై దాడికి పాల్పడిన 16మందిపై కేసు

కారేపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రబోడు, మాణిక్యారం, ఊటవాగు ప్రాంతంలో బుధవారం జరిగిన పోడు భూమి ఘర్షణలో ఫారెస్టు సిబ్బందిపై దాడికి పాల్పడిన ఇద్దరు సీపీఎం నాయకులతోపాటు 16మందిపై కేసు నమోదైంది. ఫారెస్టు బీట్ అధికారి శిల్ప ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్‌కు మేనేజర్‌గా పదోన్నతి

వైరా, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వైరా మున్సిపాలిటీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నర్సింహమూర్తికి మేనేజర్‌గా పదోన్నతి లభించింది. ఆయనకు వైరా మున్సిపల్ కార్యాలయంలోనే పోస్టింగ్ ఇస్తూ ఆ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మేనేజర్‌గా పదోన్నతి పొందిన నర్సింహమూర్తిని మున్సిపల్ కమిషనర్ చింతా వేణు ఘనంగా సన్మానించారు. మున్సిపల్ డీఈ నరేష్‌రెడ్డి, ఏఈ శ్రీమాన్యా, టీపీవో ఇటుకాల భాస్కర్, ఆర్ఐ ప్రదీప్, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ వేలం పాట

ఏన్కూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నాచారం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణం నందు పాలు, బెల్లం, బియ్యం, లడ్డూ, పులిహోర ప్రసాదం, కొబ్బరిచిప్పలు పోగు చేయడానికి ఈనెల 19వతేదీన శనివారం బహిరంగ వేలంపాటు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఎస్.శేషయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 6305439495 నెంబరులో సంప్రదించాలన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి

పెనుబల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆత్మహత్యలు, వారి సమస్యల పరిష్కారం కోసం నాటి కేంద్రప్రభుత్వం స్వామినాథన్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని, ఆ కమీషన్ సిఫార్సులను ప్రస్తుత పాలకులు బుట్టదాఖలు చేశారని జిల్లా రైతుసంఘం కార్యదర్శి బొంతు రాంబాబు విమర్శించారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు అరుణప్రతాప్ అధ్యక్షతన ఆరో మహాసభ గురువారం కారాయిగూడెంలో జరిగింది. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, వ్యవసాయ రంగంపై ప్రభుత్వ ప్రోత్సాహం ఇవ్వకపోవడంతో ఆర్థికంగా దివాళా తీస్తున్నారని, రోజు రోజుకు నిత్యవసర ధరలు కూడా పెరుగుతున్నయన్నారు. సీతారామ డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, నాయకులు చలమాల విఠల్‌రావు, పోట్రు రాజారావు పాల్గొన్నారు.

గోదావరి జలాల రాకతో ..
రైతుల సంబరాలు

» పూజలు చేసిన అన్నదాతలు



పూజలు చేస్తున్న రైతులు

కల్లూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సీతారామప్రాజెక్టు నుంచి గోదావరి జలా లు సాగర్ కాల్వ ద్వారా కల్లూరు మండలానికి చేరుకోవడంతో గురువారం పలు గ్రామాలకు చెందిన రైతులు సంబురాలు జరుపుకున్నారు. ఈ వానకాలం సీజన్‌లో సాగు చేసిన వరిపైరు సాగునీటి ఎద్దడితో ఎండిపోతున్న సమయంలో ఈ ప్రాంతానికి చెందిన రైతుల విజ్ఞాపనలకు స్పందించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో సంప్రదించి సకాలంలో గోదావరి జలాలు విడుదల చేయడం తమకు ఎంతో ఆనందాన్ని నిచ్చిందని కల్లూరు మండలానికి చెందిన పలు గ్రామాల రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా చంద్రుపట్ల గ్రామంలో సాగర కాల్వలో గోదావరి జలాలు చేరడంతో రైతులు ఆనంద పడి గంగమ్మ తల్లికి కుంకుమ, పసుపు, పూలు చల్లగా, మహిళలు హారతి పట్టి పూజలు చేశారు. అనంతరం ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మంత్రు లు తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమెల్యే రాగమయిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, ముకర విజయరావు, రైతు లు తూము శ్రీనివాసరావు, వల్లపనేని అప్పారావు, పైళ్లా నాగేశ్వరరావు, గంధం చిరంజీవి, వైకుంఠపు కృష్ణారావు, చప్పడి గోపాలరావు, తిప్పారెడ్డి జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

దారుగాబంజరలో..

ఈ వానాకాలం సీజన్‌లో వ్యసాయ సాగుకు గడ్డుపరిస్థితి ఏర్పడింది. సాగునీటి ఎద్దడితో ఈ ప్రాంత రైతులు సాగు చేసిన వరి పైరు, నారుమడులు ఎండిపోతుండగా స్పందించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గోదావరి జలాలు అందించి ఆదుకున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ దారుగాబంజర గ్రామంలో ప్రముఖ యువరైతు ఎస్‌కె ఖాదార్ ఆధ్వర్యంలో పలువురు రైతులు గోదావరి జాలలకు పూజలు చేశారు. అర్చకులు ప్రసాద్ నేతృత్వంలో రైతులు కుంకుమ, పసుపుతో గోదావరి జలాలకు హారతి పట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు మందడపు మురళి, ఈపూరి శ్రీనివాసరావు, మందడపు కృష్ణారావు, ఉన్నం ఆదియా తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ వ్యవస్థకు మోదీ అనుకూలం

» బాగం హేమంతరావు

ముదిగొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ శక్తులకు ప్రధాని మోదీ ఊడిగం చేస్తూ ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆరోపించారు. గురువారం ముదిగొండలో సీపీఐ సీనియర్ నాయకుడు పయ్యావుల లింగయ్య అధ్యక్షతన జరిగిన 11వ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కార్మిక, కర్షక సమస్యలపై పోరాడేది ఎర్రజెండా అన్నారు. సామాన్య ప్రజలు అప్పులు ఎగ్గొడితే శిక్షించే ప్రభుత్వాలు బ్యాంకుల్లో లక్షల కోట్లరుణాలను తీసుకుని ఎగ్గొట్టిన దేశద్రోహులకు బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుందని విమర్శించారు. ప్రభుత్వాలు చేసిన అప్పులను ప్రజలపై మోపుతున్నారని దుయ్యబట్టారు. మావోయిస్టుల ఏరివేత పేరుతో దండకారణ్యంలో దమనకాండను బీజేపీ ప్రభుత్వం నిలుపుదల చేయాలని, ఆపరేషన్ కగార్ పేరుతో నరమేధం చేస్తోందని విమర్శించారు. అనంతరం సీపీఐ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా రావులపాటి శ్రీనివాసరావును నాల్గోసారి ఎన్నుకున్నారు. సభలో సీపీఐ సీనియర్ నాయకుడు మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, మహ్మద్ సలాం, కొండపర్తి గోవిందరావు, మోహన్‌రావు, లక్ష్మీనారాయణ, అజ్మీరా రాంమ్మూర్తి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సత్యనారాయణరావు



సత్యనారాయణరావుకు కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి పొంగులేటి

పెనుబల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండల సీనియర్ నాయకుడు, సొసైటీ మాజీ అధ్యక్షుడు కందిమళ్ల వెంకటసత్యనారాయణరావు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు కీసర శ్రీనివాసరెడ్డి, సోమరాజు సీతారామారావు, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, పసుమర్తి విశ్వనాథ్ పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను వేగంగా పరిష్కరించాలి

» అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి
» సోషల్ వేల్ఫేర్ గురుకుల పాఠశాల తనిఖీ



గురుకులంలో పరిసరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

బోనకల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంలో బాగంగా పెండింగ్ భూ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. బోనకల్ తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. భూ భారతి చట్టం కింద రెవిన్యూ సదస్సుల్లో తీసుకున్న దరఖాస్తులు, వాటి పరిష్కారం గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా భూ భారతి చట్టం కింద మెరుగైన సేవలు వారికి అందించేలా కృషి చేయాలన్నారు. బోనకల్ సోషల్ వేల్ఫేర్ గురుకుల పాఠశాలను ప్రభుత్వ ఆదేశాలలో బాగంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న భోజనం, వసతుల కల్పనను పరిశీలించారు. విద్యార్థులకు బోధన చేసే తరగతుల వద్దకు వెళ్లి ఉపాధ్యాయుల బోధనతో పాటు పిల్లల సామార్థ్యాలను తనిఖీ చేశారు. సంబంధిత సబ్జక్టుల్లో పిల్లలకు ప్రశ్నలు వేసి సమాధానాలను రాబట్టారు. అంకితబావంతో పని చేసి విద్యాభివృద్ధికి దోహద పడాలని ఉపాధ్యాయులకు సూచించారు. గదుల కొరతతో పాటు ఫర్నిచర్ సమస్యలు ఉన్నాయని ప్రిన్సిపాల్ పద్మావతి అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

రైతులు నానో యూరియానే వాడాలి

వైరా, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రైతులు నానోయూరియా, డీఏపీని వాడుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి మయాన్ మంజూ ఖాన్ సూచించారు. మండలంలోని ఖానాపురం గ్రామంలోని పత్తిపైరులో నానోయూరియా, డీఏపీ వాడకంపై గురువారం క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యూరియా, డీఏపీ రసాయన రూపంలో కాకుండా ద్రవరూపంలో వాడుకోవడం వల్ల రైతులకు ఖర్చు తగ్గుతుందని, ఫలితం ఎక్కువ ఉంటుందని తెలిపారు. ఏఈవో ఎస్.సైదులు, రైతులు షేక్.లాల్‌మహ్మద్, బాబు, దస్తగిరి, నునావత్ వెంకన్న, శీలం నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఏన్కూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నానోయూరియా, డీఏపీపై గ్రోమోర్ సంస్థ ఆధ్వర్యంలో ఆరికాలయపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో వ్యవసాయాధికారి నరసింహారావు మాట్లాడుతూ.. నానో ఎరువులు ప్రాముఖ్యతను రైతులకు క్లుప్తంగా వివరించారు. నానో ఎరువుల వినియోగం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించుకోవచ్చని, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందవచ్చని, భూసారం పరిరక్షించుకోవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏరియా మార్కెటింగ్ మేనేజర్ పొన్నం బాలకృష్ణ, స్టోరీ మేనేజర్ పూనాటి రమేష్, ఏఈవోలు శ్రీకాంత్, బాలకృష్ణ, లహరి, నవ్య, భవ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే
ప్రభుత్వ ధ్యేయం : పైడిపల్లి

బోనకల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ జిల్లా నాయకుడు పైడిపల్లి కిషోర్ కుమార్ తెలిపారు. మండలంలోని కలకోట, చిన్నబీరవల్లి గ్రామాల్లో గురువారం నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో మూడు గ్రామాల్లో అంతర్గత రహదారులకు ఎస్సీ సబ్ ప్లాన్ కింద నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నిధులు మంజూరు చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ చేబ్రోలు వెంకటేశ్వర్లు, గత్తం బాలరాజు, చంద్ర వెంకట్రావు, మాజీ సర్పంచ్ యంగల దయామణి, అమరయ్య, మర్సకట్ల సంజీవరావు, యంగల రవికుమార్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బాలల్లో సృజనాత్మకతను పెంచాలి

» అదనపు కలెక్టర్ శ్రీజ



సత్తుపల్లిలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న శ్రీజ

సత్తుపల్లిరూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యావిధానం సాఫల్యతగానీ, వైఫల్యంగానీ ఉపాధ్యాయుడు అనుసరిస్తున్న బోధన పద్ధతిపై ఆధారపడి ఉంటుందని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. సత్తుపల్లి పట్టణంలోని బాలికోన్నత పాఠశాలతో పాటు మండలంలోని రేజర్లలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయుడికి విషయ పరిజ్ఞానంపై ఉన్నపట్టు, బోధనా నైపుణ్యం, బోధన అభ్యాసకుని స్థాయిని, అభిరుచి, పూర్వజ్ఞానాన్ని, అభ్యాసకునిలోని ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకుని విద్యా బోధన ప్రక్రియ కొనసాగాలని సూచించారు. విద్యార్థులలో సరైన ఆసక్తులు, వైఖరులను వృద్ధి చేసే విధంగా బోధిస్తూ వారిలోని సృజనాత్మక శక్తులను వెలికి తీసేవిధంగా తరగతి గదిలో ఉపాధ్యాయుడు కృషి చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని వివిధ కార్యక్రమాలతో పాటు మౌలిక వసతులను పరిశీలించి ఎంఈవో నక్కా రాజేశ్వరరావుకు పలు సూచనలు చేశారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

ముదిగొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ముదిగొండ మండలం పమ్మి గ్రామం వద్ద గురువారం సాయంత్రం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చింతకాని మండలం తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన కొమ్ము బాలస్వామి(52) ద్విచక్రవాహనంపై పమ్మిలోని తన అక్క వద్దకు వచ్చి వెళ్తుండగా అతివేగంగా ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో బాలస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

‘ఆయిల్‌పామ్’ను సందర్శించిన శాస్త్రవేత్తలు



ఆయిల్‌పామ్ తోటలో శాస్త్రవేత్తలతో రైతులు

సత్తుపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆయిల్ పామ్ తోటలను భారతీయ ఆయిల్‌పామ్ పరిశోధనా సంస్థ (ఐఐఓఆర్) శాస్త్రవేత్తలు సందర్శించారు. మొక్కలను పరిశీలించి నమూనాలు సేకరించారు. గురువారం సత్తుపల్లి మండలం నారాయణపురం, పాకలగూడెం, గౌరిగూడెం గ్రామాల్లోని ఆయిల్‌పామ్ తోటలను శాస్త్రవేత్తలు డాక్టర్ ఎంవీ.ప్రసాద్, డాక్టర్ రామచంద్రుడు, డాక్టర్ కళ్యాన్‌బాబు, ఆయిల్‌ఫెడ్ ఓఎస్‌డీ డాక్టర్ అడపా కిరణ్ పరిశీలించారు. వీరి వెంట ఖమ్మం ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్, జిల్లా ఆయిల్‌ఫెడ్ ఇన్‌చార్జి శంకర్‌లు ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 29 మంది రైతులకు సంబంధించిన తోటల్లో మొక్కలను పరిశీలించాలని ఆయిల్‌ఫెడ్ పెదవేగిలోని ఐఐఓపీఆర్‌కు లేఖ రాసింది. ఈ మేరకు ముగ్గురు శాస్త్రవేత్తలతో కమిటి నియమించగా వారు ఈ నెల మొదటి వారంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు బుధ, గురువారాల్లో ఖమ్మం జిల్లాలో తోటలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు 80 ఎకరాల్లో మొక్కలు పరిశీలించి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు విలేకర్లతో మాట్లాడుతూ.. 65 నమూనాలు సేకరించామని వీటిని శాస్త్రీయంగా అధ్యయనం చేసిన తరువాత ఆయిల్‌ఫెడ్‌కు నివేదిక సమర్పిస్తామని చెప్పారు. ఆయిల్‌పామ్ మొక్కల్లో ఏవైన లోపాలుంటే అందుకు గల కారణాలతో తాము నివేదిక ఇస్తామని దీనిపై ఆయిల్‌ఫెడ్ మాత్రమే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ రకంగా తాము అధ్యయనం చేయడం రాష్ట్రంలో మొదటి సారి అని అన్నారు. హాఫ్‌టైప్ మొక్కల వల్ల రైతులు నష్టపోయారని వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయిల్‌ఫెడ్ శాస్త్రవేత్తలకు లేఖ రాసినట్లు తెలిసింది. శాస్త్రవేత్తలతో పాటు తుంబూరు మహేశ్వరరెడ్డి, చెలికాని వెంకటరావు, టి.కృష్ణారెడ్డి పలువురు రైతులు ఉన్నారు.